సాక్షి నిజామాబాద్

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



కిడ్నాప్ కథ సుఖాంతం

నగరంలో కిడ్నాప్‌నకు గురైన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

- 8లో ▸



దర్జాగా నొక్కేశారు..

విద్యార్థులకు అందించే యూనిఫాంల నగదును కొందరు హెచ్‌ఎంలు సొంత అకౌంట్‌లో జమ చేసుకున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.9 /20.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వసతి గృహాల తనిఖీ



సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్: రెంజల్, ఎడపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహాలను ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శశికళ శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. 'వార్డెన్ రాక.. వసతులు లేక' శీర్షికన శనివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. హాస్టళ్లను సందర్శించి వసతులపై ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్ హాజరు రిజిస్టర్ పరిశీలించారు.

నేడు గురుకుల కళాశాలల ప్రవేశ పరీక్ష



డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా(సీవోఈ) కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో కే అలివేలు, డీసీవో బి సంగీత శనివారం తెలిపారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నిజామాబాద్ ఆర్‌సీవో పరిధిలోని నిజామాబాద్ జిల్లాలో టీఎస్ డబ్ల్యూఆర్ఎస్/జేసీ ధర్మారం(బి), కంజర, ఆర్మూర్, సుద్దపల్లి, పోచంపాడ్, నవీపేట్, కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, భిక్కనూర్, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, కొయ్యగుట్ట/తక్కడపల్లి, పెద్దకొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల, పెద్ద ఎక్లార, బాన్సువాడ/బోర్లాం, నిర్మల్ జిల్లాలో ముథోల్, లెఫ్ట్ పోచంపాడ్, జామ్, కడెం, బైంసాలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు జనరల్ విభాగంలో 3,522 మంది విద్యార్థులు హాజరు కాగా 207 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 2,517 మంది హాజరు కాగా 209 మంది పరీక్షకు రాలేదు. ఇంటర్ అధికారి రఘురాజ్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల కోసం 7న స్పెషల్ డ్రైవ్

కామారెడ్డి క్రైం: ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాల కోసం 7న స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్‌లో షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్‌గా పనులకు డిమాండ్ ఉందన్నారు. 21–45 ఏళ్లలోపు వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై, ఆయా రంగాలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 7న కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొనాలన్నారు.

పిల్లికి పాలు ఇచ్చిన పంది

బాల్కొండ: జాతి వైరం మరిచి పిల్లి ఆకలిని తీర్చింది ఓ పంది. శనివారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో పంది ఉండగా పిల్లి దాని వద్దకు వెళ్లి పాలు తాగడం... పంది కూడా తల్లి ప్రేమను చూపించడాన్ని అక్కడున్న వారు ఆసక్తిగా తిలకించారు.





గోరు వెచ్చని ప్రేమ

ఉదయం నీరెండలో చిన్నారులతో కూర్చున్న ఈ మహిళల చిత్రం జిల్లా జనరల్ ఆస్పత్రిలోనిది. సూర్యరశ్మిలో లభించే విటమిన్ 'డి' చిన్నారులకు అందించడంలో భాగంగా మహిళలు ప్రతిరోజు ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు ఇలా ఆస్పత్రి ఆవరణలో కూర్చుంటారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వినీతనే చైర్‌పర్సన్

- అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- నెల రోజుల అనంతరం వీడిన ఉత్కంఠ





సంబురాలు చేసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత వర్గీయులు

ఆర్మూర్: నెల రోజులుగా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో .. ఎట్టకేలకు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. పండిత్ వినీతపై సొంత పార్టీ అయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిరుబాటు బావుటా ఎగరవేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ మేరకు కలెక్టర్ జనవరి 4న అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిసెంబర్ 29న ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆర్మూర్ మున్సిపాలిటీలో నమోదు చేయించుకున్నారు. అయితే ఈయనకు ఓటు హక్కు విషయంలో అధికారులు స్పష్టతనివ్వలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం సమావేశంలో 24 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తగా, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాత్రం చేతు ఎత్తలేదు. కాగా 24 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లేనని అధికారులు ప్రకటించారు. అయితే మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే ఓటుతో కలిపి 37 ఓట్లు ఉండగా 2/3 కోరం అంటే 25 మంది ఓటర్లు చేతులు లేపి మద్దతు తెలిపినప్పుడే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అవుతుంది. ఈ సాంకేతిక అంశం ఆధారంగా.. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చేతు ఎత్తకపోవడంతో తీర్మానం వీగిపోయినట్లుగా ప్రకటించాలని పండిత్ వినీత వర్గీయులు కోర్టుతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. పూర్వాపరాలు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లేనని ప్రకటించింది. అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించిన ఆర్డీవోకు స్పష్టత లేని కారణంగా గందరగోళ పరిస్థితి నెలకొన్నందన ఆర్డీవో వినోద్‌కుమార్‌ను వివరణ కోరాల్సిందిగా కలెక్టర్‌కు సీడీఎంఏ సూచినట్లు సమాచారం.

పట్టణంలో సంబురాలు

ఆర్మూర్‌టౌన్: చైర్‌పర్సన్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటన రావడంతో ఆమె వర్గీయులు పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, మామిడిపల్లి, పెర్కిట్ చౌరస్తాలో పటాకులు కాల్చారు.

రాకేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలకు షాక్..

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఇద్దరికీ పండిత్ వినీత వర్గం షాక్ ఇచ్చినట్లుగా అయ్యింది. వీరిద్దరూ చైర్ పర్సన్ వినీతను గద్దె దింపడం కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ అధికార పార్టీ అండతో తిరిగి చైర్ పర్సన్ పీఠాన్ని దక్కించుకున్న తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అనుమానాలెన్నో..!

- మహేందర్ అనుమానాస్పద మృతి
- గుండెపోటుతో మరణించాడని భార్య ఫిర్యాదు
- మృతుడు సుపారి హత్యకేసులో నిందితుడు
- జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం
- నియోజకవర్గంలో విస్తృత చర్చ



నందిపేట్(ఆర్మూర్): సుపారీ హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు.. పలు కేసుల్లో అత్యంత వివాదాస్పదుడు నందిపేట మండలం లక్కంపల్లి తాజామాజీ సర్పంచు సుమలత భర్త మూడ మహేందర్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు.

ఆర్మూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరుపొందిన ఆయన శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు మొదట ప్రచారం జరిగింది. అయితే శనివారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించడంతో మహేందర్‌ది హత్యా ? ఆత్మహత్యా ? అనుమానాలతో చర్చనీయాంశమైంది. గత నెల 22న ఇద్దరు స్నేహితులు, ఇద్దరు పోలీసు శాఖకు చెందిన వారితో కలిసి గోవాకు వెళ్లిన

మహేందర్ అక్కడ నిషేధిత డ్రగ్స్ అతిగా తీసుకుని పక్షవాతానికి గురైనట్లు సమాచారం. ఈ విషయం తెలిసి ఆయన భార్య మరుసటి రోజు గోవాకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడి ఆస్పత్రిలో నాలుగు రోజుల చికిత్స అనంతరం ఒక పోలీస్ అధికారి సహాయంతో హైదారాబాద్ అపోలో ఆస్పత్రిలో చేరిన మహేందర్ మృతి చెందాడు. కాగా ఆయనకు పక్షవాతం వచ్చిన విషయాన్ని, చివరికి చనిపోయిన మూడు గంటల వరకు ఎందుకు ఎవరికీ తెలియనీయలేదని, గుండె పోటుతో మరణిస్తే ఎందుకు పోస్టుమార్టం చేస్తారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భార్య ఫిర్యాదు..

గోవాలో మెడికల్ లీగల్ కేసుగా నమోదైనందున ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మహేందర్ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు నందిపేట ఎస్సై రాహుల్ తెలిపారు. ఫిట్స్‌తో పాటు గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శనివారం స్వగ్రామంలో జరిగిన మహేందర్ అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పలువురు తాజా మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

స్టేటస్‌లో ఫొటోలు..

ఓ వైపు పక్షవాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే.. మరోవైపు మహేందర్ ఫోన్ స్టేటస్‌లో ప్రతిరోజు గోవాలో తిరుగుతున్నట్లు ఆయన ఫొటోలు దర్శనమిచ్చాయి. చివరికి ఆయన చనిపోయిన రోజు కూడా ఉదయం 10.36 గంటలకు స్టేటస్‌లో గోవా బీచ్ ఫొటోలు కనిపించాయి. మహేందర్ మృతి ఘటన వెనుక రహస్యాలను మరుగు పర్చడానికే ఇలా స్టేటస్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి ఉంటారని అంటున్నారు. గోవాలో నిషేధిత డ్రగ్స్ స్వయంగా తీసుకున్నాడా.. అతనికి ఉన్న క్రిమినల్ నేపథ్యం వెనుక సూత్రధారులెవరైనా బలవంతంగా ఎక్కువ డోసులు ఇచ్చారా అనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు



పోలీసులతో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీ కల్మేశ్వర్ అన్నారు. 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే స్థలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని దగ్గి అటవీ ప్రాంతం నుంచి మెండోర పోలీస్ స్టేషన్ పరిధిలోని చాకిర్యాల్ చౌరస్తా వరకు ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మార్గంలో 12 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ప్రమాదాల నివారణకు కొన్ని యూ టర్న్‌లను పూర్తిగా మూసివేయాలని, అనుమతి లేని దాబాలు, వ్యాపార సాముదాయాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుర్తించిన ప్రదేశాల్లో సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరం ఉన్న చోట వాహనాల వేగం తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ జయ్‌రామ్, ప్రొబేషనరి ఐపీఎస్ చైతన్య రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వెంకటరమణ, ఏసీపీ కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఫుడ్ సేఫ్టీ డిసిగ్నేటెడ్ ఆఫీసర్ తారాసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూతురు పుట్టిన రోజే..

- ప్రమాదంలో తండ్రి మరణం
- కుటుంబ సభ్యులకు గాయాలు

బాన్సువాడ : కూతురు పుట్టిన రోజు కుటుంబ సభ్యులంతా కలిసి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తాపడి తండ్రి మరణించిన ఘటన విషాదాన్ని నింపింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నస్రూల్లాబాద్ మండలం మిర్జాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సబ్బిడి హన్మండ్లు (53) తన కూతురు కృష్ణవేణి పుట్టిన రోజు వేడుకను దైవ సన్నిధిలో జరపాలనుకున్నాడు. శనివారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆటో బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండపై నుంచి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న హన్మండ్లుతో పాటు కూతురు కృష్ణవేణి, భార్య జయశ్రీ, అత్త గంగవ్వ, డ్రైవర్ దత్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అందరినీ నిజామాబాద్ తరలిస్తుండగా హన్మండ్లు మార్గమధ్యలోనే మృతి చెందాడు. మిగతా వారు చికిత్స పొందుతున్నారు.



హన్మండ్లు (ఫైల్)

లేత మనసుకు గాయం!

- బాలికలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ఎక్కువ కేసుల్లో దగ్గరి వారే నిందితులు



జిల్లాలో పోక్సో కేసుల వివరాలు

2021	2022	2023
55	80	77

ఖలీల్‌వాడి: చిన్నారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఘటనల్లో నిందితులుగా బంధువులు, చుట్టుపక్కల వ్యక్తులే ఎక్కువగా ఉంటున్నారు. లైంగిక దాడులు, అత్యాచారాలు లేత మనసులను గాయపరుస్తున్నాయి. దీంతో బాలికల చదువు, వారి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుంది. బాలికలకు ఎదిగే వయస్సులో ఏది మంచి, ఏది చెడో తెలియదు. దీంతో కొంత మంది వికృత చేష్టల కు పాల్పడుతున్నారు. కొందరు అశ్లీల చిత్రాలకు అలవాటు పడి బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం..

మోపాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు మోసగించాడు. పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే ముఖం చాటేయడంతో బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మరోఘటనలో నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఇటీవల విచారణ నిమిత్తం ఓ గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఎవరు లేకపోవడంతో పక్క ఇంటిలో ఉన్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

కేసుల విచారణలో వేగం

బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు పోక్సో కేసులు నమోదు చేస్తున్నారు. ఈ కేసుల్లో దర్యాప్తు, విచారణ కూడా వేగంగా చేపడుతున్నారు. ఆరు నెలలో ఛార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. జిల్లాలో పోక్సో కోర్టు అందుబాటులో ఉండటంతో కేసుల విచారణ త్వరగా జరిగి శిక్షలు పడుతున్నాయి. ఈ కేసుల్లో 20 ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తున్నారు.

అవగాహన ముఖ్యం

బాలికలకు తినుబండారాలు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలు ఉన్నాయి. బయటి వ్యక్తులు ఇచ్చే చాకెట్లు, మిఠాయిలు, ఇతర బహుమతులను పిల్లలు తీసుకోకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. ఇంటి పరిసరా ప్రాంతాలు, స్కూల్‌లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తున్నారా అని తెలుసుకోవాలి. పాఠశాలల్లో కూడా విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలి. టీచర్లు కూడా విద్యార్థినుల సమస్యలు తెలుసుకోవాలి.

దృష్టి సారించాలి

బాలికలపై తల్లిండ్రులు దృష్టి సారించాలి. స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలి. ఎవరితో సన్నిహితంగా ఉంటున్నారో చూడాలి. ఒంటరిగా విడిచి వెళ్ల వద్దు. కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండేలా చూడాలి. – నరహరి, పట్టణ సీఐ, నిజామాబాద్

ప్రత్యేకాధికారులు అంకితభావంతో పనిచేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

సుభాష్‌నగర్: గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. పంచాయతీరాజ్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావుతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లకు వారి అధికారాలు, బాధ్యతల గురించి తెలియజేసేందుకు వీలుగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. వేసవి ప్రారంభం అవుతున్న దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. గ్రామాల్లో ఈ నెల 7 నుంచి 15 వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు బావన్న, శంకర్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ విభాగం అధికారి రాకేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

షబ్బీర్‌ను సన్మానించిన జిల్లా కాంగ్రెస్‌ నాయకులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని జిల్లా కాంగ్రెస్‌ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌ హందాన్‌, కిసాన్‌సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌ రెడ్డి, భక్తవత్సలం, మీసాల సుధాకర్‌రావు, షకీల్‌ అహ్మద్‌, పారుపల్లి గంగారెడ్డి ఉన్నారు.

రెండో రోజు పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో శనివారం 2వరోజు ఎంఈడీ 1, 2, 3వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. నగరంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన పరీక్షా కేంద్రంలో 19 మందికి 19 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

17 నుంచి తెయూ పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్‌ కోర్సుల సెమిస్టర్‌ పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి అరుణ శనివారం తెలిపారు. పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్‌ పరీక్షలు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్‌ కోర్సుల (ఐఎంబీఏ, ఏపీఈ, పీసీహెచ్‌)కు సంబంధించి 7వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షలు ఈ నెల 17 నుంచి 28 వరకు కొనసాగుతాయన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

బోధన్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిన గైనకాలజిస్టు స్పెషలిస్టు పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్‌ శివ శంకర్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 5లోగా బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో దరఖాస్తులు సమర్పించాలని, 6న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

టీజీసెట్‌ హాల్‌ టికెట్లు విడుదల

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీజీసెట్‌-2024 ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని గురుకుల విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారిణి అలివేలు శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలతో పాటు సాధారణ గురుకులంలో ప్రవేశాల కోసం ఈ పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌ టికెట్లను వెబ్‌సైట్‌ ద్వారా డౌన్‌లోడ్‌ చేసుకోవాలన్నారు.

దర్జాగా నొక్కేశారు..

- 20 మంది హెచ్‌ఎంల సొంత అకౌంట్లలో రూ.3.20 లక్షలు జమ
- రికవరీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు
- ఈనెల 15 వరకు గడువు



నిజామాబాద్‌ అర్బన్‌: విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల నగదును కొందరు హెచ్‌ఎంలు దర్జాగా నొక్కేశారు. పాఠశాల విద్యార్థులకు దుస్తులను కుట్టి ఇచ్చేందుకుగాను మంజురయ్యే నిధులను ఏజెన్సీతో పాటు కొందరు హెచ్‌ఎంలు తమ సొంత అకౌంట్లో జమ చేసుకున్నారు. తీరా ఏడాది తర్వాత దుస్తులు లేకపోవడం నిధులు ఖర్చవడంపై ఉన్న అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో సీరియస్‌గా తీసుకున్న అధికారులు డబ్బులను రికవరీ చేయాలని ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖ ప్రస్తుతం గల్లంతైన రూ. మూడు లక్షలు రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

అసలేం జరిగిందంటే...

జిల్లా వ్యాప్తంగా 1195 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2లక్షల50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 2022–23 ఏడాదికి గాను ఏకరూప దుస్తులను అందించేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే దుస్తులకు సంబంధించిన దుస్తులను సరఫరా చేసింది. స్థానికంగా విద్యార్థులకు దుస్తులను కుట్టి ఇచ్చేందుకు పలు ఏజెన్సీ ద్వారా అందించాలని ఆదేశించారు. ఇందులో ఒక్కో దుస్తుకు రూ. 50 చొప్పున కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా మెప్మా ఆధ్వర్యంలో దుస్తులు కుట్టి ఇవ్వాలని నాటి కలెక్టర్‌ ఆదేశించడంతో వారు బాధ్యత తీసుకున్నారు. వారు కార్తికేయ ఏజెన్సీ, ఫర్ఫెక్ట్‌ టైలర్‌, దేవేందర్‌ అనే ముగ్గురికి కుట్టిచ్చే బాధ్యతలను అప్పగించారు. ఇందులో కొందరు సకాలంలో దుస్తులను కుట్టించి ఇవ్వలేదు. దేవేందర్‌ అనే టైలర్‌ సకాలంలో దుస్తులు అందించకపోవడంతో చెల్లించిన దుస్తుల నగదు ఇవ్వాలని నాటి జిల్లా అధికారులు ఆదేశించడంతో నిధులు వెనక్కి ఇచ్చేశాడు. కానీ సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు మాత్రం ఆ నగదును తమ సొంత అకౌంట్లో జమ చేసుకున్నారు. సరిగ్గా ఏడాది తర్వాత సంబంధించిన దుస్తులు రాకపోవడం, లెక్కల్లో నిధులు చూపకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో మొత్తం మంజూరైన నిధులు దుస్తుల వివరాలను పరిశీలించగా 20 మంది హెచ్‌ఎంలు దుస్తులను ఇవ్వకున్నా తమ అకౌంట్లో నగదు వేసుకున్నారు. మొత్తం రూ.3.20లక్షలు ప్రభుత్వ నిధులను ప్రధానోపాధ్యాయులు తమ అకౌంట్లో వేసుకున్నట్లు తేలింది. ఏడాది పొడవునా ఈ నిధులను తమ దగ్గరే ఉంచుకోవడం సరైంది కాదని తక్షణమే నిధులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సంబంధించిన అకౌంట్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో కొందరు మొండికేయగా జిల్లా విద్యాశాఖ అధికారి తీవ్రంగా స్పందించి నోటీసులు జారీ చేస్తుండడంతో తిరిగి నిధులను జిల్లా విద్యాశాఖకు జమ చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించడంతో కొందరు నిధులు జమ చేస్తున్నరు. కానీ హెచ్‌ఎంలు ప్రభుత్వ నిధులను గుట్టుచప్పుడు కాకుండా తమ సొంత అకౌంట్‌లో జమ చేసుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

నగదును రికవరీ చేస్తున్నాం

కొందరు హెచ్‌ఎంల అకౌంట్‌లో నిదులు ఉన్నట్లు గుర్తించి వాటిని ప్రస్తుతం రికవరీ చేస్తున్నాం. కొందరు హెచ్‌ఎంలు దుస్తులు, నిధులు ఇవ్వలేదు, వాటిని గుర్తించడం జరిగింది. నగదు చెల్లించని హెచ్‌ఎంలపై చర్యలు తప్పవు.

–శ్రీనివాస్‌రావు, సీఎంవో, జిల్లా విద్యాశాఖ

బాలుడి కిడ్నాప్‌ కథ సుఖాంతం

- రూ.3 లక్షలకు హైదరాబాద్‌లో విక్రయించిన కిడ్నాపర్‌ సోహైల్‌
- సీసీటీవీ ఆధారంగా కేసు విచారణ
- తల్లిదండ్రులకు అప్పగించిన డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్‌



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ

ఖలీల్‌వాడి: నగరంలో బాలుడి కిడ్నాప్‌ కథ సుఖాంతమైంది. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ జయరాం మాట్లాడుతూ.. మాలపల్లికి చెందిన మహ్మద్‌ సల్మాన్‌ అలియాస్‌ మిరాజ్‌ అనే ఏడేళ్ల బాలుడు ఈ నెల 31న కిడ్నాప్‌నకు గురైనట్లు బాలుడి తండ్రి మహమ్మద్‌ అయాజ్‌ ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ కల్మేశ్వర్‌ ఆదేశాల మేరకు ఎస్సై రమేశ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్‌ గురించి పోలీసులు విచారణ చేపట్టగా సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాప్‌ చేసిన సోహైల్‌ను అదుపులోకి తీసుకున్నారు. సదరు కిడ్నాపర్‌ సోహైల్‌ బాలుడి ఇంటి పక్కనే ఉంటాడు. తరచూ బైక్‌పై తింపడంతోపాటు తినుబండరాలు కొనిచ్చేవాడు. ఎప్పటిలాగే సోహైల్‌ బాలుడిని బైక్‌పై తీసుకెళ్లి కిడ్నాప్‌ ముఠాకు చెందిన దంపతులు షేక్‌అబిద్‌, సబానాబేగంలకు అప్పగించాడు. అనంతరం వారు బాలుడిని కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ జరీనా, హలియాలకు బాలుడిని షేక్‌ అబిద్‌ అప్పగించగానే వారు ఫలక్‌నామాలోని ముస్తాఫా రోడ్డులోని ముఠాసభ్యులకు అప్పగించారు. ముఠాసభ్యులు కిడ్నాప్‌ చేసిన వారికి రూ.3 లక్షలు చెల్లించారు. ఇందులో సోహైల్‌కు రూ.70 వేలు, షేక్‌ అబిద్‌, సబానాబేగంలు రూ.1.70 లక్షలు తీసుకోగా, జరీనా, హాలియాలకు రూ. 10 వేలు ఇచ్చినట్లు తెలిపారు. మిగితా డబ్బు ఖర్చుల కోసం వినియోగించినట్లు చెప్పారు.

సీసీటీవీల ఆధారంగా..

సీసీటీవీ పుటేజీల ఆధారంగానే బాలుడిని కిడ్నాప్‌ చేసిన సోహైల్‌ను పట్టుకున్నట్లు డీసీపీ జయరాం తెలిపారు. కిడ్నాపర్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని తమదైనశైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడిందన్నారు. బాలుడిని కిడ్నాప్‌ చేసే ముఠా సభ్యుల నుంచి విడిపించినట్లు చెప్పారు. బాలుడిని తల్లిదండ్రులు సాహిదాబేగం, మహమ్మద్‌ అయాజ్‌కు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్‌ అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్‌, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై రమేశ్‌ ఉన్నారు.

యాపిల్‌ ప్లే స్కూల్‌లో ఫ్రూట్స్‌ఫెస్ట్‌..



నగర శివారులోని గంగాస్థాన్‌లో ఉన్న యాపిల్‌ ప్లే స్కూల్‌లో ఫ్రూట్‌ఫెస్టివల్‌ను శనివారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పండ్లతో ఏర్పాటు చేసిన ఫ్రూట్‌ఫెస్టివల్‌ ఎంతగానో ఆకట్టుకుంది. – సాక్షి, స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌ నిజామాబాద్‌

ఆత్మవిశ్వాసంతో పని చేయాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రుద్రూర్‌: పార్టీ నిర్దేశించిన లక్ష్యసాధనకు ఆత్మవిశ్వాసంతో పని చేయాలని బీజేపీ జహీరాబాద్‌ పార్లమెంట్‌ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కార్యకర్తలకు సూచించారు. పోతంగల్‌, కోటగిరి, రుద్రూర్‌ మండల కేంద్రాల్లో శనివారం ఆయన పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్లమెంట్‌ ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఎన్నికల్లో కార్యకర్తల పనితీరుపై చర్చించారు. గెలుపు కోసం సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో కామారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్‌ భూపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌ సభ్యుడు గంగాధర్‌గౌడ్‌, నాయకులు దొరబాబు, జగన్మోహన్‌ రెడ్డి, కాపుగండ్ల శ్రీనివాస్‌, ప్రకాశ్‌ పటేల్‌, హరికృష్ణ, నాగం సాయిలు, మక్కయ్య, గజేందర్‌, కృష్ణం రాజు, నవీన్‌ పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత



సిరికొండ: మండలంలోని గోప్య తండాలో బాల్య వివాహాన్ని అధికారులు శనివారం అడ్డుకున్నారు. తండాకు చెందిన మైనర్‌ అమ్మాయికి ధర్పల్లికి చెందిన 26 ఏళ్ల యువకుడితో ఈ నెల 5న వివాహం చేయాలని ఇరు కుటుంబీకులు నిర్ణయించారు. బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఏఎస్సై బాల్‌సింగ్‌, ఎమ్మార్తై నాగన్న, బాల్యరక్ష ఆఫీసర్‌ చైతన్య, కౌన్సిలర్‌ జమ్రు చైల్డ్‌ లైన్‌ సిబ్బంది అమ్మాయి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని వారికి అవగాహన కల్పించారు. ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి అమ్మాయిని తీసుకురావాలని కుటుంబ సభ్యులకు వారు సూచించారు.

బాలికపై అత్యాచారం.?

- పోలీసుల అదుపులో నిందితుడు

బాన్సువాడ: పట్టణంలోని ఓ హోటల్‌లో బాలికపై ఓ వ్యక్తి అత్యాచారం చేయడంతో స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన బాలికను తీసుకెళ్లి పట్టణంలోని ఓ హోటల్‌లో అత్యాచారం చేస్తుండగా గమనించిన స్థానికులు సదరు వ్యక్తిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఉత్తమ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌



మాట్లాడుతున్న శిశిర్‌కుమార్‌

భిక్కనూరు: జంతుశాస్త్ర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తమ సంస్థలో ఇంటర్న్‌షిప్‌ అవకాశం కల్పించనున్నట్లు హావెల్‌ ఫౌండర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శిశిర్‌కుమార్‌ అన్నారు. శనివారం ఆయన తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన లైఫ్‌ సైన్సెస్‌ లో ఉపాధి అవకాశాల కల్పన మార్గదర్శకత్వం అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విశ్వ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాణించేందుకు తమ సంస్థ ఆద్వర్యంలో పరిశోధనలకు, ఉపాధి అవకాశాల కల్పనకు సహాయ సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో రచన త్రిపాటి, ప్రిన్సిపాల్‌ సుధాకర్‌గౌడ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజేశ్వరీ, అధ్యాపకులు యాలాద్రి, సునీత, నారాయణగుప్తా, ప్రతిజ్ఞ సునీల్‌కుమార్‌, విజయకుమార్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్కర్‌నగర్‌లో చోరీ

బోధన్‌టౌన్‌: పట్టణంలోని శక్కర్‌నగర్‌ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సీఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న అరుణారాణి తన ఇంటికి శుక్రవారం తాళం వేసి మేడ్చల్‌కు వెళ్లింది. శనివారం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూ.లక్షా50 వేల నగదు, రెండున్నర తులాల బంగారం, వెండి, బైక్‌ చోరీకి గురైనట్లు బాధితురాలి తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సైలెన్సర్లు ధ్వంసం



సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కామారెడ్డి క్రైం: భారీ శబ్దం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో తిరుగుతున్న వాహనాలపై పట్టణ పోలీసులు కొరడా ఝులిపించారు. బైక్‌లకు ఉండే సైలెన్సర్‌లను విడదీసి పట్టణ పీఎస్‌లో శనివారం రోడ్‌ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజులుగా పట్టణ పరిధిలో చేపడుతున్న వాహనాల తనిఖీల్లో పెద్ద శబ్దంతో తిరుగుతున్న 26 బైక్‌లను గుర్తించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి పంచనామా నిర్వహించి రోడ్‌రోలర్‌తో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు.

క్రైం కార్నర్‌

గోవూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి




గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వర్ని(మోస్రా): మండలంలోని గోవూర్‌ శివారులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు వర్ని పోలీసులు శనివారం తెలిపారు. గ్రామ శివారులో మృతదేహం ఉందన్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు ర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రానికి చెందిన పటేల్‌ శ్రీనివాస్‌ (35) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌ ఉపాధి నిమిత్తం ముంబాయికి వలస వెళ్లి ఏడాది క్రితం కోటగిరికి వచ్చాడు. నాటి నుంచి ఏ పని చేయలేదు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై అప్పులు చేశాడు. శుక్రవారం పురుగుల మందు సేవించి కిందపడిపోయాడు. విషయం గ్రహించిన కుటుంబీకులు బోధన్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిక్లిలో సఫాయి కార్మికుడు..



చిన్న సాయిలు(ఫైల్‌)

మాక్లూర్‌: భార్య అనారోగ్యంతో బాధపడుతుండడ తట్టుకోలేని భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిక్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిని సాధువుల చిన్నసాయిలు(65) గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో భార్య సుశీల అనారోగ్యానికి గురై మంచం పట్టింది. భార్య అనారోగ్యాన్ని తట్టుకోలేని భర్త రెండు రోజుల క్రితం క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. జీపీ కార్యదర్శి ఎండల రాజేశ్‌ బాధిత కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ.10 వేల నగదు అందజేశారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: మండల శివారులోని చెరువులో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ శనివారం పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంట తండాకు చెందిన నీల శాంత (33) ఇంట్లో భర్తతో గొడవ పడి గత నెల 30న ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. శాంత తల్లి ఫిర్యాదు మేరకు ఈ నెల 2న పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డి చెరువులో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతదేహం నీల శాంతగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి/ లింగంపేట: కామారెడ్డి జిల్లా లింగంపేట్‌ మండలం మోతె గ్రామానికి చెందిన మంగళి కాశీరాం (35) డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాశీరాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో కుటుంబపోషణ భారంగా మారింది. మానసిక కుంగుబాటుకు గురై మతిస్థిమం సరిగా లేకుండా పోయింది. కాశీరాం ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒకరి బైక్‌ తీసుకుని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌ సమీపంలో కాశీరాం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని గమనించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌ కార్డు ఆధారంగా మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో మరొకరు..

రుద్రూర్‌: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోతంగల్‌ మండగల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొంతల శ్రీను(35) కూలీ పనులు చేస్తు జీవిస్తుంటాడు. గతంలో భార్యతో గొడవలు కావడంతో విడాకులు తీసుకున్నాడు. తల్లి పోశవ్వతో ఉంటున్న శ్రీను కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం తల్లి కళ్యాపూర్‌లో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీను జీవితంపై విరక్తితో శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూరులో మద్యానికి బానిసై..

ఎల్లారెడ్డి: మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భిక్కనూర్‌ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి మోహన్‌(24) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి దుర్గవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్‌

- ఒకరు మృతి



భాస్కర్‌ (ఫైల్‌)

మోపాల్‌: మండలంలోని కంజర శివారులో టిప్పర్‌, బైక్‌ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన గుడి భాస్కర్‌(43) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం భాస్కర్‌ పొలం పనులు ముగించుకొని కంజర వైపు వస్తుండగా అదే సమయంలో టిప్పర్‌ కంజర నుంచి ముల్లంగి వైపు వెళ్తోంది. కంజర శివారులో టిప్పర్‌ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో భాస్కర్‌ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ప్రథమ చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి భార్య కవిత గతంలోనే చనిపోయింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న సుధాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్‌ పేర్కొన్నారు.

సాతెల్లిలో ఒకరిపై దాడి

ఎల్లారెడ్డిరూరల్‌: వ్యవసాయ భూమి విషయంలో చిన్నాన్నపై అన్న కొడుకు దాడి చేసిన ఘటన మండలంలోని సాతెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసగళ్ల సదానందంపై అతడి అన్న కొడుకు ప్రవీణ్‌ గొడ్డలితో వ్యవసాయ భూమి విషయంలో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ సదానందంను కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు.

ఒకరి అదృశ్యం

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): మండలంలోని పెద్ద దేవీసింగ్‌ తండాకు చెందిన భాముస్‌ దేవీలాల్‌ అదృశ్యమైనట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. గత నెల 11న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో సైతం అదృశ్యం కాగా వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులు విచారిస్తారనే భయంతో..



సాయిలు(ఫైల్‌)

గాంధారి: మండలంలోని మాతు సంగెం గ్రామానికి చెందిన నీరడిసాయిలు(46) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలు కామారెడ్డిలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గతంలో గుర్జాల్‌ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబానికి సాయిలుకు మధ్య గొడవలు జరిగాయి. కులపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి రాజీ కుదిర్చారు. ఈ క్రమంలో సదరు మహిళ కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో మహిళ భర్త గాంధారి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ విషయం సాయిలుకు తెలియడంతో పోలీసులు తనను ప్రశ్నిస్తారేమోనని భయంతో శనివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెదిరింపుల కేసులో ముగ్గురి అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: భూమిని కబ్జా చేసేందుకు యత్నించి, రిటైర్డ్‌ తహసీల్దార్‌ను బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్‌ చేసినట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్‌ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన రిటైర్డ్‌ తహసీల్దార్‌ పోశెట్టి 1989లో మున్సిపల్‌ పరిధిలోని కాకతీయనగర్‌ కాలనీలో ఉండే సర్వే నంబర్‌ 206లో 262 గజాల ప్లాటును కొనుగోలు చేశాడు. ప్లాటు ఖాళీగా ఉండటంతో దానిపై కన్నేసిన విద్యానగర్‌కు చెందిన శంకరయ్య, శివకుమార్‌, సంతోష్‌లు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకునేందుకు పథకం వేశారని డీఎస్పీ తెలిపారు. గతంలో వేసి ఉంచిన ఫెన్సింగ్‌ను కూల్చేయడంతో పాటు, కొద్ది రోజుల క్రితం మరోసారి ఫెన్సింగ్‌ వేస్తుండగా దౌర్జన్యానికి దిగినట్లు వెల్లడించారు. రిటైర్డ్‌ తహసీల్దార్‌ను కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారని పేర్కొన్నారు. పోశెట్టి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ యాక్ట్‌తో పాటు పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. నిందితులను శనివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.